క్లుప్తంగా

అలరించిన త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాల సందర్భంగా ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారం సీతారామస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు శనివారం శాస్త్రయుక్తం జరిగాయి. ఆ ఆరాధనోత్సవాలకు సంగీత విదుషీమణి డాక్టర్ కె.శేషులతా విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని త్యాగరాజస్వామి గురించి, ఆయన కీర్తనల్లో భావాలను వివరించారు. ఈ సందర్భంగా తాతపూడి సౌమ్యలక్ష్మి, పేరి సత్యవాణి, ఆంద్ర ఉషారాణి, కొప్పర్తి శ్రీనిత్య తదితర శిష్య బృందం త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు రాగయుక్తంగా ఆలపించి ఆహుతులను అలరించారు. శ్రీరామ భక్త బృందం, లలిత మండలి సభ్యులు ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న సంగీత అభిమానులకు సేవలు అందించారు. కార్యక్రమంలో భీమనపల్లి దేవాయాధికారిణి కోనేటి కార్తీక, సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర



ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

యానాం: నూతన విద్యావిధానం-2020లో భాగంగా శనివారం యానాం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం అధ్యాపకులు, పీజీ,యూపీ చదువుతున్న విద్యార్థులు అటవీ పర్యావరణ వ్యవస్థ పరిస్థితి, సేవలు, జీవవైవిధ్యం అనే అంశంపై అధ్యయనం చేసేందుకు మారేడిమిల్లి అటవీ ప్రాంతానికి విజ్ఞానయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.శ్రీలత మాట్లాడుతూ అటవీపర్యావరణ వ్యవస్థలు, జీవవైవిధ్యం బలంగా పరస్పరం అనుసంధానం చేసి ఉంటాయని పర్యావరణ పరిరక్షణకు వరదల ముంపు నుంచి కాపాడడంలో, జీవరాశుల ఆరోగ్య విషయంలోను, నేల సంరక్షణ లోను ఆర్థికపరమైన వస్తువుల ఉత్పత్తి చేయడంలో అడవులు ఎంతగానో తోడ్పడతాయని విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ టి ముత్యాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణ



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

యానాం: స్థానిక ఓల్డేజ్‌హోమ్ సంస్థ పారిశుధ్య కార్మికుల ద్వారా శనివారం పట్టణంలో పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. గత వారం రోజులుగా డంపింగ్‌యార్డు స్థలం తేలకపోవడంతో సంబంధిత పారిశుధ్య నిర్వహణను చేసే హెచ్‌ఆర్‌స్క్వేర్ సంస్థ పారిశుధ్య పనులను నిలిపివేసింది. దీంతో ఎక్కడికక్కడ అన్ని వీధుల్లోను చెత్త భారీగా పేరుకుపోవడంతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్పందించి తాను వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న ఓల్డేజ్‌హోమ్ సంస్థ కార్మికులతో పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించారు.

కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు

అమలాపురంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గాల వారీగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించిందని ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 90 రోజులు శిక్షణ అనంతరం 75 శాతం హాజరు ఉన్న మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్ అందిస్తారని, పరీక్షలు నిర్వహించి అవసరమైన మల్టీపర్పస్ కుట్టుమెషీన్లు అందించేందుకు దశల వారీగా చర్యలు చేపట్టనుందన్నారు. జిల్లాలో 3243 మంది మహిళలకు శిక్షణను ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మెట్ల రమణబాబు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

అమలాపురం టౌన్: అమలాపురం ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ మహిళా కళాశాలలో జాబ్ మేళాను ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్లూస్టార్, జెప్టో, ఫోక్సన్, డైకన్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. అభ్యర్థులు తమ టెన్త్ క్లాస్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ చదివిన వారు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని సూచించారు.



పట్టణంలో కామాక్షీ పీఠం ప్రేమ మందిరం అమ్మ వాణిని సత్కరిస్తున్న వాకర్స్ మహిళా హెల్త్ క్లబ్ ప్రతినిధులు



పట్టణంలో రక్తదానం చేస్తున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ



ముమ్మిడివరంలో మహిళా సిబ్బందిని సత్కరిస్తున్న సీఐ ఎం.మోహన్‌కుమార్ తదితరులు



ఆర్టీసీలో ఉద్యోగులను సత్కరిస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు తదతరులు

జననివి నీవే.. జగమంతా నీవే..

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు సత్కారం, బహుమతులు



పట్టణ ఎస్‌టీయూ ఆధ్వర్యంలో సత్కారం అందుకున్న మహిళలు

అమలాపురం టౌన్: సృష్టికి మూలం మహిళ. అన్నింటా అండగా ఉండేది మహిళ. దేవుడు అన్ని చోట్ల ఉండలేక అంతటి శక్తి ఉన్న మహిళను సృష్టించాడు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గాల్లో వేడుకలు నిర్వహించారు. మహిళలను సత్కరించారు. స్థానిక కామాక్షీ పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరం అమ్మగా అన్ని సాకే వక్కలంక వాణిని అమలాపురం వాకర్స్ మహిళా హెల్త్ క్లబ్ శనివారం ఘనంగా సత్కరించింది. నేటి మహిళలు అనాధలు అమ్మవాణిని ఆదర్శంగా తీసుకోవాలని మహిళా వాకర్స్ అన్నారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో అమ్మ వాణిని సేవలను కొనియాడి మహిళా వాకర్స్ సత్కరించి ఆమెకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందతున్న దాదాపు 50 మంది పిల్లలకు అమ్మపాత్రను సమర్థంగా పోషిస్తున్న వాణి సేవలు ఎంతో విలువైనవని క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కె.విజయలక్ష్మి, క్లబ్ ప్రతినిధులు దూవ్వూరి సుబ్బలక్ష్మి, పుత్సా రాజేశ్వరి, పేరి లలిత, శిష్టా లక్ష్మి, శ్రీగిరి పద్మావతి తదితరులు అమ్మ వాణి సేవలను కొనియాడారు.

'ఆరోగ్య' ఉద్యోగుల రక్తదానం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సెంటర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.శంకరరావు, బ్లడ్ బ్యాంక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొని 20 మంది మహిళా ఉద్యోగుల నుంచి రక్తాన్ని సేకరించారు. మరో 100 మందికి రక్త గ్రూప్‌ల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రక్తదానం వల్ల అటు రోగులు, క్షతగాత్రులకు జరిగే మేలు, ఇటు దానం చేసిన వ్యక్తుల ఆరోగ్య ప్రయోజనాలపై వైద్యులు అవగాహన కల్పించారు. శిబిరంలో బ్లడ్ బ్యాంక్ ఉద్యోగులు దొడ్డా కాశీ, చొల్లంగి రాజశేఖర్, యల్లమెల్లి రమణమూర్తి, చిట్టిమేను కృష్ణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మాకిరెడ్డి పూర్ణిమ తదితరులు పాల్గొని సేవలు అందించారు.

అమలాపురం పట్టణంలో..

స్థానిక అంబేడ్కర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించింది. పట్టణ ఎస్‌టీయూ మహిళా అధ్యక్షురాలు ఆర్.దుర్గ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 18 మహిళా ఉపాధ్యాయులను సామూహికంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ ప్రతినిధులు షంషాద్ బేగం,ఎస్‌టీ మంజూష, ఎమ్. సీతామహాలక్ష్మి, సాయిదుర్గా భవాని, బి.సూర్యకాంతం, కె.దివ్య, ఎన్.బాలకృష్ణ, బి.రామాకాంతారావు, ఎస్. గోపీరాజు, ఎంఎస్ఎన్ మూర్తి, కేఎస్ఎన్ మూర్తి పాల్గొని మహిళా దినోత్సవ విశిష్టతను విరించారు.

యానాంలో ...

యానాం: సమస్యలను ఎదుర్కొనేలా మహిళలు మానసిక ధైర్యాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కె.శ్రీలత, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారితతో కుటుంబాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కోఆర్డినేటర్ శ్రీలత మాట్లాడుతూ మహిళలు లింగవివక్షత లేని సమాజ స్థాపన జరగాలన్నారు. మహిళలకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. పిడి కె రమేష్, అధ్యాపకులు డాక్టర్ ఘనీస్, ఉమాదేవి, భారతి, శ్రీదేవి, కావజీబీ, చంద్రశేఖరరావు, దుర్గయ్య, శాంతిరాజు, ఏవీఎస్ మూర్తి, ముత్యాలు, మంగాదేవి, జి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ సాగర్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

సావిత్రీనగర్‌లో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..

స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల జయలక్ష్మీ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగఅజ్మీరా, జయవీరన్, సాధనాల బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సత్కారం

సోషల్ యాక్టివిస్టులు దుగ్గుదుర్తి అనిత, చెక్కపల్లి లక్ష్మీబాయి, జ్యోతి, మోకా రవణమ్మ తదితరులును ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో సత్కరించారు.

మహిళలను సత్కరించిన సీఐ

ముమ్మిడివరం: స్థానిక సర్కిల్ పరిధిలోని మహిళా సిబ్బందిని సీఐ ఎం.మోహన్‌కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం ఎస్సైలు డి. జ్వాలా సాగర్, అవినాష్, మల్లికార్జునరెడ్డి పోలీసు సిబ్బంది పాల్గన్నారు. ముమ్మిడివరం మహిళా కళాశాలలో కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించారు. కళాశాల డైరక్టర్ జగతా సురేష్, గణేశుల సురేష్, గుర్రం మహేష్, పితాని గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: సృష్టికి మూలం స్త్రీ అని, అన్ని రంగాల్లో స్త్రీలు రాణిస్తున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. గోడి గ్రామంలోని ఆయన నివాసంలో మహిళా మూర్తులను శనివారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ స్త్రీ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిని సాధించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్త్రీలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేశారని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మీ, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, దొమ్మేటి శ్రీశాంతిభవాని, బస్వాని పద్మలను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దంపతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, పులుసుగంటి ప్రసాదరావు, రేవు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం : మహిళా వాకర్స్ క్లబ్, నడిపూడి వాకర్స్, లాఫింగ్ క్లబ్ సంయుక్తంగా స్థానిక కూచిమంచి అగ్రహారంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ సాయి శిల్ప మాట్లాడారు. అనంతరం డాక్టర్ సాయి శిల్పను వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. పట్టణ ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మహిళా దినోత్సవం జరిగింది. తులసి మొక్కలు నాటారు. ఆర్య వైశ్య మహిళలను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని కూడా సత్కరించారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధనం 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీతారామపురంలో రిలయన్స్ ధీరూబాయి అంబానీ దివ్యాంగుల కేంద్రం ప్రతినిధులు ఎంవీ గోపాల్, శ్రీకాంత్, సత్తిబాబు తదితరులు ప్రముఖ న్యాయవాది స్వరాజ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు. మహిళా చట్టాలు, హక్కులను స్వరాజ్యలక్ష్మి వివరించారు. తాళ్లరేవు ది పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పాడి శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని వైద్యులు, మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కోరంగి పోలీస్‌స్టేషన్‌లో వక్తృత్వ పోటీలో గెలిచిన విద్యార్థిని సత్కరించి బహుమతి ప్రదానం చేశారు. తాళ్లరేవు గ్రామ పంచాయతీలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవిని సిబ్బంది ఘనంగా సత్కరించారు.

అమలాపురం మండలంలో...

అమలాపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో డాక్టర్ రోహిణి హాస్పిటల్ గైనకాలజిస్ట్ పాల్గొన్నారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఉత్తమ మహిళా ఉద్యోగులను నగదు బహుమతితో సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణ మూర్తి, భాస్కరరావు, ధనమ్మ, అసిస్టెంట్ ఇంజినీర్ గంగుమళ్ల రామలక్ష్మీదేవి, అసిస్టెంట్ మేనేజర్లు ప్రతిమాకుమారి, అచ్యుతాంబ, ఓటీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరహాలబాబు పాల్గొన్నారు. కామనగరువు, ఈదరపల్లి, బందారులంక, ముమ్మిడివరం మదర్ థెరిసా మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మహిళా ఉద్యోగులను సత్కరించారు.

ఇంజినీరింగ్ కళాశాలలో..

బీవీసీ భట్లపాలెం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మేనేజ్మెంట్ విభాగాధిపతి గోకరకొండ నాగేంద్ర అధ్యక్షతన జరిగిన సభలో కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి విద్యార్థినులకు పలు ఆరోగ్య చిట్కాలు, సూచనలు అందించారు. కళాశాల సెక్రటరీ కనకయ్య, ప్రిన్సిపా ల్ రామారావు, వాకార్స్ అధ్యక్షుడు సత్యవర ప్రసాద్, బదన్, రాజగోపాల్, మూర్తి, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం ఐసీడీఎస్ విస్తరణ అధికారి నాగలక్ష్మి అన్నారు. ఐ పోలవరంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ మాట్లాడారు. ఐ.పోలవరం హైస్కూల్ విద్యార్థిని నక్క సత్య కమలశ్రీ మీనన్‌ను గౌరవంగా సత్కరించారు. స్వచ్ఛంద సంస్థల నుంచి వచ్చిన డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు, గుత్తినదీవి విస్తరణాధికారి మీనాక్షి, స్థానిక మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నందివర్ధనం



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ విస్తరణాధికారి నాగలక్ష్మి



కర్రి నేహాశ్రీకి బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్సై సత్యనారాయణ



మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దంపతులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అర్థాని దినేష్, రామ్మూర్తి తదితరులు



పోలీస్ స్టేషన్‌లో సోషల్ యాక్టివిస్టు మహిళలకు సత్కారం



డాక్టర్ సాయి శిల్పను సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

లోక్ అదాలత్‌లో 366 కేసుల పరిష్కారం



ముమ్మిడివరంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి మహమ్మద్ రహంతుల్లా తదితరులు



అమలాపురంలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టు భవనాల ప్రాంగణంలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో మొత్తం 366 కేసులు పరిష్కారమయ్యాయి. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. పరిష్కారమైన 366 కేసుల్లో 31 సివిల్ కేసులు, 20 బీఎస్ఎన్ఎల్ కేసులు, 5 బ్యాంక్ కేసులు, 280 క్రిమినల్ కేసులు, 30 మోటారు యాక్సిడెంట్ కేసులు ఉన్నాయి. అదాలత్‌లో మొత్తం రూ.4,69,43,050 విలువైన 366 కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు కార్యాలయం తెలిపింది. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎ.సాయికుమారి, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎండీ. రెహ్మతుల్లా, లోక్ అదాలత్ మెంబర్లు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో 328 కేసులు పరిష్కారం

ముమ్మిడివరం: స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 328 కేసులు పరిష్కారమైనట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా తెలిపారు. వీటిలో ఈపీలు 4 కేసులు, ఈ కేసులకు సంబంధించి రూ.2,23,328లు, ఓఎస్ మనీ కేసులో రూ.12,90,000, ఓఎస్ టైటిల్ ఒకటి, ఎంసీ 1 ఎన్ఐ యాక్టు 5 కేసులలో రూ.12,73,329 అపరాధ రుసుం వసూలైంది. ఐపీసీ సీసీలు 56 కేసులలో రూ. 3,14,000, ఎక్సైజ్ 224 కేసుల ద్వారా రూ.17,95,022లు, బ్యాంకు కేసులు 12లో రూ.5,41,000, బీఎస్ఎన్ఎల్ 13 కేసుల ద్వారా రూ.12,468, బెంచ్ కోర్టు ఐపీసీ సీసీ 1 5 అడ్మిషన్ కేసుల ద్వారా రూ.20,000 మొత్తం 328 కేసులలో రూ.56,69,000 అపరాధ రుసుము వచ్చినట్లు జడ్జి రహంతుల్లా తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో బార్ అసోషియేషన్ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, ఏజీపీ టి.శాంతిసుధ, కేఎల్వీ ప్రసాదరావు, గ్రంధి రామారావు, జి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.అలీ అస్సన్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: కేవీ బొమ్మూరు గ్రిడ్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు కోనసీమ జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. ప్రస్తుతం 160 కెపాసిటీ రెండు, 100 ఎంవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. 100 వీఏ స్థానంలో 160 ఎంవీఏ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకూ జరగుతాయి. కోనసీమ జిల్లాలో కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురం, ఏడిద 132 కేవీ సబ్‌స్టేషన్ లోడ్స్ 220 కేవీ సామర్లకోట గ్రిడ్ సబ్‌స్టేషన్ నుంచి, రాజోలు 132 పరిధిలోని సబ్ స్టేషన్ల నుంచి, 220 కేవీ గ్రిడ్ సబ్ స్టేషన్ నుంచి సరఫరా చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా లోడ్స్ మార్చేటప్పుడు స్వల్ప విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. మార్చి నెలలో పెద్దగా అంతరాయం ఉండదని, ఏప్రిల్‌లో ఎండలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్ఈ రాజబాబు ప్రకటనలో తెలిపారు.

శాస్త్రోక్తంగా రుద్ర హోమం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రుద్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాదన, రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. 33 మంది భక్తులు గోత్రానామాలు నమోదు చేసుకొన్నారు. శివుని జన్మ నక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతి నెల రుద్ర హోమం నిర్వహిస్తారు. ఏర్పాట్లు ఆలయ సహాయ కమీషనర్, కార్య నిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి శనివారం ఓ భక్తుడు విరాళం అందించారు. భీమవరానికి చెందిన శ్రీ కంచర్ల వెంకట రామకృష్ణ దంపతులు రూ.10,116 వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు అందించారు. చెక్కును ఆలయ పర్యవేక్షణ అధికారికి శ్రీనివాసరాజుకి అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో దాతలు ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

ఘనంగా నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భీమనపల్లి గ్రామంలో ఉన్న బాల త్రిపురసుందరీ దేవి సమేత అనంగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆలయ ఈవో కె.కార్తీక, వరదా శ్రీరామ చంద్ర మూర్తి సమక్షంలో మహాశివునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెలువలపల్లి వెంకట సూర్య సత్యనారాయణశర్మ ఉదయం నుండి స్వామి వారికి రుద్రాభిషేకాలు చేసి, బిల్వార్చన ఘనంగా చేశారు. అనంతరం ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచితం మాటున కాసుల వేట

- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రూ.లక్షల్లో దోపిడీ



లంకాఫ్ ఠానేల్లంక గోదావరి తీరంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న దృశ్యం



తాళ్లరేవులో ట్రాక్టర్లపై అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ముమ్మిడివరం: ఉచిత ఇసుక దళారీల పంట పండిస్తోంది. అక్రమార్కులు అనధికారిక ర్యాంపుల ద్వారా ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం మండలంలో లంకాఫ్ ఠానేల్లంక, ఐ.పోలవరం మండలంలో ఎదుర్లంక, గుత్తెనదీవి, తాళ్లరేవు మండలంలో తాళ్లరేవు, పిల్లంక, గోవలంక, యానాం పరిసర ప్రాంతాలు, కాట్రేనికోన మండలం తీర ప్రాంతాలలో అనధికార ర్యాంపుల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గోదావరిలో ఇసుక సేకరించి నాటు పడవలపై ఒడ్డుకు చేరుస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లోలో జేసీబీల ద్వారా ఇసుకను తవ్వి రేయింబవళ్లు ట్రాక్టర్లు ద్వారా తరలిస్తున్నారు. కూటమి నాయకుల అండదండలతో ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా కొన సాగుతుండడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. అప్పుడప్పుడు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడులు చేసి ఒకటి రెండు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నప్పటికి అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంటోంది. ఇసుక అక్రమ రవాణా అడ్డుకునే వారికి తాయిలాలు ముట్ట చెప్పి ఈ దందాను నిరాటంకంగా సాగిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుక రూ.2500 నుంచి 3000 వరకు విక్రయిస్తు సొమ్ములు చేసుకుంటున్నారు. దూరాన్ని బట్టి ఈ ధర మరింత పెరుగుతూ ఉంటోంది. అయితే కింది స్థాయి సిబ్బందికి ముడుపులు ముట్టజెప్పి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

నాయకుల కనుసన్నల్లో..

మితిమీరుతున్న ఇసుక మాఫీయా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంకలో గోదావరి తీరంలో పొక్లెయినతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక మాటున పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారరే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నాయకుల కను సన్నలలోనే ఈ దందా జరుగుతుండడంతో అధికార గణం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. తీర ప్రాంతాల్లో నిబంధనలను తుంగలో తొక్కి లంక గ్రామాలలో ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టి నదీ పరివాహక ప్రాంతాలకు తూట్లు పొడుస్తున్నారు. అలాగే తాళ్లరేవు మండలం పిల్లంక, గోవలంక అధికార ర్యాంపులు ఉన్నప్పటికి ఉచిత ఇసుక పేరుతో ర్యాంపులకు బాటలు వేస్తున్నామంటూ అక్రమ వసూళ్లకు తెర తీస్తున్నారు. ట్రాక్టరుకు రూ.500 నుంచి 600 వరకు వసూలు చేస్తున్నారు.